క్లుప్తంగా

గణపతికి ప్రత్యేక పూజలు


సంపత్ విజయ గణపతి స్వామి వారు

బోట్‌క్లబ్: గణేశ్ నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా స్థానిక దేవదాయ శాఖ డీసీ కార్యాలయ ప్రాంగణంలో ఉన్న సంపత్ విజయ గణపతి స్వామి వారికి బుధవారం విశేష పూజలు నిర్వహించారు. ఉదయం స్వామివారికి మహాన్యాస పూర్వక పంచామృతాభిషేకం, అనంతరం గరిక పూజను అర్చకులు నిర్వహించారు. దేవదాయ శాఖ డీసీ కార్యాలయ సూపరింటెంటెంట్ కనపర్తి నాగేశ్వరరావు ఆధ్వర్యంలో పూజలు జరిగాయి. అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు. ఆలయ ఈఓ రమణ, భక్తులు పాల్గొన్నారు.

వివేకానంద బోధనలు ప్రపంచానికి ఆదర్శం


వివేకానంద విగ్రహానికి నివాళులర్పిస్తున్న సమితి సభ్యులు

బోట్‌క్లబ్: స్వామి వివేకానంద బోధనలు ప్రపంచ ప్రగతికి ఆదర్శమని పౌర సంక్షేమ సంఘం కన్వీనర్ దూసర్లపూడి రమణరాజు అన్నారు. అమెరికా మహాసభలో దేశ మత సామరస్యాన్ని వైవిధ్యాన్ని చాటుతూ స్వామి వివేకానంద 1893 సెప్టెంబర్ 11న చేసిన ప్రసంగం ప్రపంచానికి ఆదర్శంగా నిలిచిందన్నారు. ఈ ప్రసంగానికి 131 ఏళ్లు పూర్తయిన సందర్భంగా వివేకా అభ్యుదయ సేవా సమితి ఆధ్వర్యంలో వివేకానంద పార్కు ఆవరణలో బుధవారం ఆయన కాంస్య విగ్రహానికి నివాళులర్పించారు. కార్యక్రమంలో సమితి అధ్యక్షుడు పెంకె నూకరాజు, సభ్యులు చింతలపూడి రఘురాం, రాజేష్, రమేష్, రవికిరణ్, సంధ్యారాణి తదితరులు పాల్గొన్నారు.

చవితి ఉత్సవాల్లో సందడి


రమణయ్యపేటలో నిర్వహించిన నృత్య పోటీలు

కాకినాడ రూరల్: తుపాను ప్రభావం తగ్గడంతో గ్రామాలలో చవితి ఉత్సవాల్లో సందడి కనిపిస్తోంది. పలు గ్రామాలల్లో ఏర్పాటు చేసిన వినాయక శిబిరాల వద్ద ప్రత్యేక పూజలతో పాటు, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. రమణయ్యపేట గ్రామం పరిధిలో జ్యూయల్ మెడోస్‌లో ఏర్పాటు చేసిన చవితి వేడుకల్లో భాగంగా నిర్వహించిన నృత్య పోటీలు ఆకట్టుకున్నాయి.

సామూహిక సీమంతాలు


సామూహిక సీమంతాలు నిర్వహిస్తున్న సభ్యులు

కాకినాడ రూరల్: లయన్స్ క్లబ్ కాకినాడ సఖీ, శ్రీకారం సంయుక్తాధ్వర్యంలో రమణయ్యపేట మురళీధర్‌నగర్ అంగన్‌వాడీ సెంటర్‌లో బుధవారం సామూహిక సీమంతాలు నిర్వహించారు. గర్భిణులకు శాస్త్రోక్తంగా సీమంతాలు జరిపారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఐసీడీఎస్ సీడీపీఓ వై.లక్ష్మి మాట్లాడుతూ, తల్లి మానసిన ఆనందం పుట్టబోయే బిడ్డ మానసిక స్థితిపై ప్రభావం చూపుతుందని చెప్పారు. ఒత్తిడి లేని మానసిన ఆనందంతో మెలగాలని కోరారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ మార్తమ్మ, క్లబ్ ప్రాంతీయ చైర్మన్ తులసి, సఖి అధ్యక్షురాలు కొడాలి ఉమా, శ్రీకారం క్లబ్ అధ్యక్షురాలు డాక్టరు మీనా ఫర్హీన్, జోన్ చైర్మన్ ఓం నమశ్శివాయ, మాజీ సర్పంచ్ అడబాల రత్నప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

జోరుగా గ్రావెల్ అక్రమ తవ్వకాలు


ట్రాక్టర్‌లో తరలిస్తున్న గ్రావెల్

కోటనందూరు: స్థానిక గొంపకొండపై గ్రావెల్ అక్రమ తవ్వకాలు జోరుగా సాగుతున్నాయి. పంచాయతీకి పైసా కట్టకుండా రాజకీయ నాయకుల అండదండలతో గ్రావెల్ మాఫియా జేబులు నింపుకొంటుంది. పట్టపగలే మితిమీరిన వేగంతో ట్రాక్టర్లలో గ్రావెల్‌ను తరలిస్తూ జనజీవనానికి ఇబ్బంది కలిగిస్తున్నారు. ఎటువంటి ప్రభుత్వ అనుమతులు లేకుండా తమ కళ్లముందే గ్రావెల్‌ను తరలించేస్తున్నా..అధికారులు పట్టించుకోవడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. ప్రజలకు ఇబ్బంది కలిగిస్తూ దందా సాగిస్తున్న గ్రావెల్ మాఫియా ఆగడాలకు అడ్డుకట్ట వేయాలని స్థానికులు కోరుతున్నారు.

ఆకలి కాలం

అపర కోటీశ్వరుడైనా.. కడు పేదవాడైనా కష్టపడేది.. కాసులు సంపాదించేది పిడికెడు కడుపు కోసమే.. గుప్పెడు మెతుకుల కోసమే.. కాలం, కర్మం కలసిరాక.. ఆస్పత్రిలో మంచానపడ్డ రోగులు, వారి బంధువులు ఆ క్షుద్బాధను తీర్చుకునేందుకు పడుతున్న అవస్థలు.. పగవాడికి కూడా రాకూడదన్నట్టుగా ఉన్నాయి. సుదీర్ఘ చరిత్ర కలిగిన కాకినాడ జీజీహెచ్‌లో మృతదేహాలు, మరుగుదొడ్ల చెంత, దుర్గంధం వెదజల్లే చోట్ల కూర్చొని.. అన్నం ముద్దను గొంతు దాటిస్తుంటే.. వారు పడుతున్న దుర్భర.. దీనావస్థ కరకు గుండెకు కూడా కన్నీరు తెప్పిస్తుంది.

- కాకినాడ జీజీహెచ్‌లో దీనావస్థ
- గుప్పెడు మెతుకుల కోసం పడరాన్ని పాట్లు
- మృతదేహం పక్కనే భోజనాలు
- చెట్ల గట్లు, మరుగుదొడ్ల వద్దే అవస్థలు


భోజనం కోసం బారులు తీరిన రోగుల బంధువులు

కాకినాడ క్రైం: ప్రతిష్టాత్మకమైన కాకినాడ జీజీహెచ్‌లో అన్నార్తుల ఆక్రందన హృదయాలను ద్రవింపజేస్తోంది. గుప్పెడు మెతుకులకు కోసం పడుతున్న పాట్లు అన్నీఇన్నీ కావు. సుభోజనం పేరుతో రోగుల సహాయకులకు అందించే ఉచిత భోజనంతో కడుపు నింపుకోవడానికి పేద, నిరుపేదలు పాట్ల చేతపట్టుకుని బారులు తీరుతున్నారు. ఆ పూట భోజనం అందుకోవడానికి, తర్వాత తినటానికి వారు పడేపాట్లు చూస్తుంటే ఆకలికే ఆవేదన కలుగుతోంది.

ఓ గొప్ప సేవ..

కాకినాడ జీజీహెచ్‌లో హరే కృష్ణ మూమెంట్ ఆధ్వర్యంలో, దాతల సహకారంతో సుభోజనం పేరుతో రోగుల సహాయకుల కోసం ఉచిత భోజనాన్ని అందిస్తున్నారు. ప్రతి రోజు మధ్యాహ్నం 450 మంది ఈ భోజనంతో కడుపు నింపుకొంటున్నారు. వీరంతా పేద, నిరుపేదలే. ఎండకు ఎండుతూ వానకు తడుస్తూ.. నిరుపేద రోగి బంధువులు ఉచితంగా అందించే భోజనం కోసం, రోగిని వదిలి మరీ క్యూలో ఉండాల్సిన పరిస్థితి. కనీసం రెండు గంటల పాటు నిలబడి, నీరసించి పోతుంటారు. అప్పటికే రోగికి సపర్యలు చేస్తూ శుష్కించిపోతుంటారు. అటువంటి సందర్భాల్లోనూ అన్నమో రామచంద్రా.. అంటూ తమ వంతు ఎప్పుడొస్తుందా అని కాలే కడుపుతో ఎదురుచూస్తుంటారు.

మృతదేహం పక్కనే భోజనాలు

అన్నం తింటున్న వారి దీనావస్థను బుధవారం జరిగిన ఓ సంఘటన కళ్లకు కట్టింది. సుభోజనం కౌంటర్ వద్ద భోజనం తీసుకునే రోగుల సహాయకులు ఆ కౌంటర్‌కు ఆనుకుని ఉన్న ఓ షెడ్‌లో భోజనం తింటుంటారు. వెయిటింగ్ హాల్‌గా ఏర్పాటు చేసిన షెడ్‌లో తగిన నిర్వహణ లేక, అనారోగ్యంతో ఉన్న అనాథ రోగులు, భిక్షాటన చేసేవారు అక్కడే నిద్రిస్తుంటారు. ఈ క్రమంలోనే అక్కడ ఉంటూ చనిపోయిన సంఘటనలూ ఉన్నాయి. బుధవారం అనారోగ్యంతో ఓ వ్యక్తి చనిపోయాడు. సరిగ్గా భోజన సమయానికి, భోజనం అందుకున్న రోగుల సహాయకులు షెడ్‌లో ఉన్న ఆ మృతదేహం పక్కనే కూర్చొని అన్నం తింటూ ఉండడం కనిపించింది. అతడు చనిపోయాడని, అది మృతదేహమని తెలియక.. ఎవరో వ్యక్తి అక్కడ నిద్రిస్తున్నాడేమో అని అంతా భావించారు.

మరుగుదొడ్లు, చెట్ల గట్ల వద్ద..

కూర్చుని తినేందుకు తగిన సదుపాయం లేక, రోగుల బంధువులు ఎక్కడపడితే అక్కడ కూర్చొని కడుపు నింపుకొంటున్నారు. ఈ క్రమంలోనే మరుగుదొడ్ల వద్ద కొందరు కూర్చొని అన్నం తినడం చూపరులకు ఆవేదన కలిగించింది. కొందరు చెట్ల గట్లపై కూర్చొని తింటుంటే, మరి కొందరు సత్తువ లేకున్నా, నిలబడే వణుకుతున్న చేతులతో అన్నం తింటున్నారు.

నిర్వహణ సరిగ్గా లేక..

వెయిటింగ్ హాల్‌గా నిర్మించిన అక్కడి షెడ్ నిర్వహణ సరిగ్గా లేక నిరుపయోగంగా మారింది. దుర్వాసనతో, మంచి నీటి సదుపాయం లేక నిష్ప్రయోజనంగా మిగిలింది. అక్కడే సర్దుకొని ముక్కు మూసుకొని భోజనాలు చేస్తున్నారు. దాతల సహాయంతో నిర్మించిన కొత్త షెడ్‌ను కేవలం నిర్వహణ లేక మరుగున పడేశారు.

ఇలా చేస్తే మేలు..

ఉచిత భోజనం అందిస్తుంటే, దానిని అందుకోవడానికి మాత్రం అన్నార్తులు నరకం అనుభవిస్తున్నారు. అందుకు కారణం ఆస్పత్రి అధికారుల నిర్లక్ష్యమేనన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి. కళ్లముందే ఇంత జరుగుతున్నా, చూస్తూ తమకేమీ పట్టనట్టు ఆస్పత్రి బాధ్యులు వ్యవహరిస్తున్నారు. తాత్కాలిక కుర్చీలు, టెంట్లు ఏర్పాటు చేసే అవకాశం ఉన్నా, కనీస ఆలోచన చేయడం లేదు. షెడ్‌ను పూర్తి స్థాయిలో పరిశుభ్రతతో నిర్వహణ చేపడితే, ఇందులో ఒకేసారి 70 మంది కూర్చొని తినే అవకాశం ఉంది. అలాగే వరుసల్లో నిలబడి నీరసించాల్సిన అవసరం లేకుండా టోకెన్ విధానంలోనూ ఆహారాన్ని అందించవచ్చు.


విషయం తెలియక, మృతదేహం సమీపంలోనే భోజనాలు చేస్తున్న రోగుల బంధువులు

వరదలపై రాజకీయాలు మానాలి

వైఎస్సార్ సీపీ కాకినాడ రూరల్ కో–ఆర్డినేటర్ కన్నబాబు



కాకినాడ రూరల్: విజయవాడలో వరద బాధితులను ఆదుకోవాల్సిన రాష్ట్ర ప్రభుత్వం.. రాజకీయాలను ప్రోత్సహిస్తోందని మాజీ మంత్రి, వైఎస్సార్ సీపీ కాకినాడ రూరల్ నియోజకవర్గ కో–ఆర్డినేటర్ కురసాల కన్నబాబు విమర్శించారు. బుధవారం ఆయన ఇక్కడ మాట్లాడుతూ, విజయవాడలో వరదలు మానవ తప్పిదమేనన్నారు. బుడమేరు నుంచి వచ్చే వరదపై ప్రజల్లో ముందుగా అప్రమత్తం చేసి ఉంటే ప్రాణ, ఆస్తి నష్టం తగ్గేదని చెప్పారు. పడవల పేరుతో వైఎస్సార్ సీపీపై పాలకపక్ష నేతలు నిందలు వేస్తోందన్నారు. ఇది సరైన పద్ధతి కాదన్నారు. వరద తగ్గముఖం పట్టడంతో ప్రజలు త్వరగా సాధారణ జన జీవనం సాగించాలని కోరుకుంటున్నామన్నారు. బాధితులకు ప్రభుత్వం ప్రకటించిన సాయాన్ని అందించడంలో రాజకీయాలు మానుకోవాలని హితవు పలికారు. బాధితులందరికీ తక్షణం సాయం అందించి ఆదుకోవాలని కోరారు.

14న యోగా పోటీలు

నాగమల్లితోట జంక్షన్(కాకినాడ సిటీ): కోకనాడ యోగాసన స్పోర్ట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 14న జేఎన్‌టీయూకే యోగా హాల్‌లో యోగా పోటీలు నిర్వహిస్తున్నట్టు జేఎన్‌టీయూకే యోగా శిక్షకులు సీహెచ్ సుధ బుధవారం తెలిపారు. ట్రెడిషనల్ ఈవెంట్‌లో పదేళ్ల నుంచి 14 ఏళ్ల వారు, ఆర్టిస్టిక్ సోలోలో 14 నుంచి 18 ఏళ్ల వారు, ఆర్టిస్టిక్ పెయిర్‌లో 18 నుంచి 28 ఏళ్ల వారు, రిథమిక్ పెయిర్‌లో 28 నుంచి 35, 35ప్లస్ నుంచి 45 ఏళ్లు, 45ప్లస్ నుంచి 55 ఏళ్ల వారు అర్హులని వివరించారు. వివరాలకు 91334 33491 నంబరులో సంప్రదించవచ్చని చెప్పారు.

ఎస్సీ వర్గీకరణ తీర్పును పునః సమీక్షించాలి

- మాల మహానాడు జేఏసీ నేతల ర్యాలీ, ధర్నా


డీఆర్‌ఓకు వినతిపత్రం ఇస్తున్న మాల మహానాడు జేఏసీ నాయకులు

కాకినాడ సిటీ: ఎస్సీ వర్గీకరణకు వ్యతిరేకంగా జాతీయ నాయకత్వం చేపట్టిన నిరసన కార్యక్రమాలకు సంఘీభావంగా కాకినాడ కలెక్టరేట్ సమీపంలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహం వద్ద మాల మహానాడు జేఏసీ ఆధ్వర్యంలో బుధవారం నిరసన ర్యాలీ, ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా జేఏసీ చైర్మన్ సిద్ధాంతుల కొండబాబు మాట్లాడుతూ, ఎస్సీ వర్గీకరణకు అనుకూలంగా సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు రాజ్యాంగ విరుద్ధంగా, మాలలకు వ్యతిరేకంగా ఉందని చెప్పారు. 11 మంది ధర్మాసనంతో కూడిన బెంచి ఏర్పాటు చేసి, ఈ తీర్పును పునఃసమీక్షించాలన్నారు. ఎస్సీ రిజర్వేషన్లను 25 శాతానికి పెంచాలని డిమాండ్ చేశారు. ఎస్సీ వర్గీకరణ విషయంలో రాష్ట్ర ప్రభుత్వాలు రాజకీయాలు మానుకోవాలని హెచ్చరించారు. మాల మహానాడు జేఏసీ నాయకులు తోటి చెంగల్‌రావు, కుంచంగి రఘు, బుంగా సతీష్‌కుమార్, ఏనుగుపల్లి కృష్ణ, వరసాల జాన్‌ప్రభాకర్ తదితరులు మాట్లాడుతూ దళితుల మధ్య చిచ్చు పెట్టి, వారి ఐక్యతను దెబ్బతీసేందుకు మనువాద పార్టీలు చేస్తున్న కుట్రలో భాగమే ఎస్సీ వర్గీకరణ అని ఆరోపించారు. సుప్రీంకోర్టు తీర్పునకు వ్యతిరేకంగా దళితులంతా ఐక్యంగా గ్రామాల వారీగా ఉద్యమించారని, ఇప్పటికైనా వర్గీకరణ అంశాన్ని విరమించుకోవాలన్నారు. లేకుంటే ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని స్పష్టం చేశారు. అనంతరం ఆందోళనకారులు డీఆర్‌ఓ తిప్పే నాయక్‌కు వినతిపత్రం అందజేశారు.

విద్యుత్ సరఫరాకు రేపు అంతరాయం

కాకినాడ: వార్షిక మరమ్మతుల దృష్ట్యా శుక్రవారం ఉదయం 9.30 నుంచి 12.30 వరకు జగన్నాథపురం సబ్‌స్టేషన్ పరిధిలో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్టు ఏపీ ట్రాన్స్‌కో ఈఈ ఎస్.ఉదయభాస్కర్ తెలిపారు. ఫీడర్ పరిధిలోని ముత్తానగర్, గోళీలపేట, వలందపేట, తుఫాన్‌బిల్డింగ్, పోర్టుకాలనీ, జె.రామారావుపేట, కోమలివారి వీధి, చిన్నిమెస్ ఏరియా, జమ్మిచెట్టు సెంటర్, చిన్న మార్కెట్, ఏసువారివీధి, పాత జగన్నాథపురం వంతెన మున్సిఫ్ జంక్షన్, ఎంఎస్‌ఎన్ చార్టీస్, చర్చి స్క్వేర్, పురంవారివీధి, తూరంగి, మహాలక్ష్మినగర్ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందన్నారు. అందువల్ల విద్యుత్ వినియోగదారులు ఈ విషయాన్ని గమనించి, సహకరించాలని కోరారు.

డీఎంహెచ్‌ఓ ఫీడర్ పరిధిలో..

అలాగే డీఎంహెచ్‌ఓ ఫీడర్ పరిధిలో వార్షిక మరమ్మతుల దృష్ట్యా శుక్రవారం ఉదయం 7.30 నుంచి 10.30 వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్టు ఈఈ ఒక ప్రకటనలో తెలిపారు. కొమ్మిరెడ్డివారివీధి, అవసరాలవారివీధి, పిండిప్రోలువారివీధి తదితర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందన్నారు. అలాగే బాలాజీ చెరువు ఫీడర్ పరిధిలో ఉదయం 10.30 నుంచి 1.30 వరకు బాలాజీచెరువు, సాలిపేట, రాజారామ్మోహన్‌రాయ్‌రోడ్, వినుకొండవారివీధి ప్రాంతాలకు కూడా విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని వివరించారు.


నాగులపల్లి-రమణక్కపేట రోడ్డు మునగడంతో బోటుపై వెళుతున్న ప్రజలు


గొల్లప్రోలు మార్కండేయపురాన్ని ముంచెత్తిన వరద


రమణక్కపేట గ్రామంలోకి చేరిన వరద నీరు


పిఠాపురం 216 జాతీయ రహదారిపై పొంగి ప్రవహిస్తున్న గొర్రిఖండి కాలువ


పీకల్లోతు కష్టం

- పిఠాపురం నియోజకవర్గాన్ని ముంచెత్తిన వరద
- మరింత పెరిగిన ఏలేరు, సుద్దగెడ్డ వరద ఉధృతి
- ఇంకా నీటిలోనే కాలనీలు, రోడ్లు
- భారీ వరదతో చెరువులుగా మారిన పొలాలు
- మూతపడిన 216 జాతీయ రహదారి


పిఠాపురం-నాగులపల్లి రోడ్డుపై పొంగిపొర్లుతున్న నీరు


పిఠాపురం మండలంలో పంటలను ముంచిన వరద


తోటూరులో వరదలో చిక్కుకున్న ఇళ్లు


నీట మునిగిన కొత్తపల్లి మండలం ఇసుకపల్లి

పిఠాపురం/కొత్తపల్లి: ఎటు చూసినా నీరే. చెట్లూ, చేమలూ, గట్లూ, పుట్టలూ.. ఏవీ కనిపించకుండా, భూమి అనేదే ఎక్కడుందో తెలియని పరిస్థితి నెలకొంది. మంగళవారం ఉగ్రరూపం దాల్చిన ఏలేరు సుద్దగెడ్డ, గొర్రిఖండి, పెదఏరు కాలువలు బుధవారం ఉదయానికి మరింత ఉగ్రరూపం దాల్చాయి. నిన్నటి వరకు కనిపించిన పచ్చని పంట పొలాలు కనుచూపు మేరలో కానరావడం లేదు. ఇళ్లు మినహా, రోడ్లు డ్రైన్లు ఎక్కడున్నాయో తెలియదన్నట్టుగా.. వరద నీటితో అంతా సముద్రంలా దర్శనమిస్తున్నాయి. ఓవైపు సముద్రం ఉన్న పిఠాపురం నియోజకవర్గానికి మరోవైపు ఎర్ర సముద్రం వచ్చిందా అన్నట్టుగా ఉంది వరద ఉధృతి.

అంతా నష్టమే..

ఏలేరు అదనపు జలాల విడుదలతో పిఠాపురం నియోజకవర్గంలో పిఠాపురం, గొల్లప్రోలు, కొత్తపల్లి మండలాలు జలమయంగా మరాయి. చుట్టూ నీరు మినహా ఏమి కనిపించడం లేదు. వరద ప్రభావంతో ఇప్పటి వరకు పిఠాపురం నియోజకవర్గంలో పిఠాపురం, గొల్లప్రోలు, కొత్తపల్లి మండలాల్లో సుమారు 32 వేల ఎకరాల్లో వరి, వాణిజ్య పంటలు నీటిలో పూర్తిగా మునిగిపోవడంతో తీవ్ర నష్టం తప్పదని రైతులు వాపోతున్నారు. ఇంకా రెండు రోజుల పాటు వరద భీబత్సం కొనసాగనుండడంతో, పంటలు పనికి రాకుండా పోయే అవకాశాలున్నాయి. లోతట్టు కాలనీలు నీట మునిగి, ఇళ్లల్లోకి నీరు చేరి స్థానికులు నరకం చూస్తున్నారు. గొల్లప్రోలులో ఈబీసీ కాలనీ, ఎస్సీపేట, సూరంపేటతో పాటు, లోతట్టు కాలనీలన్నీ నీటిమయంగా మారాయి. మరో మూడు రోజుల పాటు వరద ఉండే అవకాశం ఉండడంతో స్థానికులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

హైవే మూసివేత!

గొల్లప్రోలు పిఠాపురం మధ్య 216 జాతీయ రహదారిని వరద నీరు ముంచెత్తడంతో వాహనాల రాకపోకలను నిలిపివేశారు. పోలీసులు రహదారి వెంబడి గస్తీ నిర్వహిస్తున్నారు. ముందు జాగ్రత్త చర్యలుగా వహనాల రాకపోకలను క్రమబద్ధీకరిస్తున్నారు. బుధవారం రాత్రికి వరద తగ్గుముఖం పడితే వాహనాల రాకపోకలకు అనుమతి ఇవ్వనున్నారు. పిఠాపురం మండలంలో విరవాడ, విరవ, మంగితుర్తి, కోలంక, ప్రత్తిపాడు, భోగాపురం, రాయవరం, రాపర్తి తదితర గ్రామాలు నీట మునగగా, గొల్లప్రోలు మండలంలో గొల్లప్రోలు నగర పంచాయతీతో పాటు, సూరంపేట, మార్కండేయపురం, ఈబీసీ కాలనీ, అరుంధతీయపేట, ఎస్సీపేట, తాటిపర్తి, చెందుర్తి, వన్నెపూడి, చేబ్రోలు తదితర గ్రామాలు వరద నీటిలో మునిగి ఉన్నాయి.. ఆయా గ్రామాల్లో రోడ్లు వరద నీటిలో మునిగి ఉండడంతో, రెండు రోజుల నుంచి రాకపోకలు నిలిచిపోగా, బుధవారం సైతం వరద తగ్గక పోవడంతో వాహనాల రాకపోకలను అనుమతించ లేదు.


పాత ఇసుకపల్లిలో చెరువును తలపిస్తున్న వరి పొలం


వరద నీటిలో పిఠాపురం పట్టణం

వరద బాధితులను ఆదుకోవాలి


యండపల్లి శివారు తోటూరులో వరద బాధితులతో మాట్లాడుతున్న వంగా గీత

- ముంపు ప్రాంతాల్లో మాజీ ఎంపీ గీత పర్యటన

కొత్తపల్లి: ఏలేరు వరద ముంపు ప్రాంతాలైన నాగులపల్లి, రమణక్కపేట, యండపల్లి శివారు తోటూరుల్లో బుధవారం వైఎస్సార్ సీపీ పిఠాపురం నియోజకవర్గ ఇన్‌చార్జి వంగా గీత పర్యటించారు. వరద పరిస్థితిని సమీక్షించారు. ముంపు బాధిత ప్రజలతో మాట్లాడి, వారి సమస్యలను తెలుసుకున్నారు. బాధితులకు ఆహారం, తాగునీరు అందించాలని, ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని అధికారులకు తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వరద బాధితులను ప్రభుత్వం ఆదుకోవాలన్నారు. పిఠాపురం నియోజకవర్గంలో ప్రజలు వరద కారణంగా ఇబ్బందులు పడుతున్నారన్నారు. ముంపు ప్రాంతాల్లో సహాయక చర్యల్లో వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొనాలని పిలుపునిచ్చారు. ఆమె వెంట వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు ఆనాల సుదర్శన్, నాయకులు వాడిశెట్టి నారాయణరెడ్డి, రావు చిన్నారావు, జ్యోతుల బాబులు, జ్యోతుల చక్రబ్బాయి, గండేపల్లి బాబి, ఉప సర్పంచులు గుర్రాల చిరంజీవి కుమార్, గండ్ర శ్రీధర్, నేరెళ్లరెడ్డి తదితరులు ఉన్నారు.


రమణక్కపేటలో నీట మునిగిన వరిపొలం


గొల్లప్రోలు నగర పంచాయతీలోని ఓ వీధి ఇలా..


తోటూరులో ఇళ్లను చుట్టుముట్టిన వరద నీరు


ముంపు ప్రాంతంలో పర్యటిస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు